

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా అమర్



విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. అమర్ 2019 ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. అయితే గత ఎన్నికల్లో విశాఖలోని గాజువాక నుంచి పోటీచేసి ఓడిపోయారు. తరువాత పార్టీ అధిష్ఠానం చోడవరం అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించింది. తాజాగా జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీకి పరాభవం

ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాస తీర్మానం



పిళ్లా రమాకుమారి, చైర్‌పర్సన్

- రమాకుమారిని పదవి నుంచి దించే విషయంలో బెడిసికొట్టిన వ్యూహం
- గత నెలలో అవిశ్వాస నోటీసుపై 19 మంది కౌన్సిలర్లు సంతకాలు
- ఈ నెల 22న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ ప్రకటన
- తెరవెనుక చక్రం తిప్పిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్
- వైసీపీలో చీలిక.. ఆరుగురు కౌన్సిలర్లు ఊటీ శిబిరానికి తరలింపు
- బలం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం సమావేశానికి వైసీపీ గైర్హాజరు
- తీర్మానం వీగిపోయినట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటన
- కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు



మునిసిపల్ కార్యాలయం వద్ద విక్టరీ సింబల్ చూపుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, కూటమి నాయకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మునిసిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై వైసీపీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి అసవరమైనంత మంది సభ్యులు లేకపోవడంతో వైసీపీ కౌన్సిలర్లు ప్రత్యేక సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో చైర్‌పర్సన్ పదవిపై కొద్ది రోజులుగా నెలకొన్న ఉత్కంఠతకు తెరపడింది. రమాకుమారి పూర్తిస్థాయిలో ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

మునిసిపల్ పాలకవర్గంలో వైసీపీకి చెందిన 19 మంది కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ రమాకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ గత 26వ తేదీన జిల్లా కలెక్టర్, ఆర్డీఓతోపాటు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజుకు నోటీసు అందజేశారు. దీంతో ఈ నెల 22వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం నర్సీపట్నం ఆర్డీఓ వి.వి.రమణ ప్రిసైడింగ్ అధికారి హోదాలో మునిసిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ప్రసాదరాజుతో కలిసి ఉదయం 10 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ధనుంజయరావు పర్యవేక్షణలో మునిసిపల్ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభమైన తరువాత 30 నిమిషాల వరకు ఒక్క కౌన్సిలర్ కూడా రాలేదు. దీంతో ప్రిసైడింగ్ అధికారి సమావేశాన్ని రెండు గంటలపాటు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మరోసారి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసారి కూడా కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో చైర్‌పర్సన్ రమాకుమారిపై వైసీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్టు ప్రిసైడింగ్ అధికారి రమణ ప్రకటించి సమావేశాన్ని ముగించారు. అప్పటికే బయట వేచివున్న కూటమి నాయకులు, చైర్‌పర్సన్ వర్గీయులు ఆనందం వ్యక్తం చేశారు.



ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించిన ప్రిసైడింగ్ అధికారి వీవీ రమణ, ఒక్క కౌన్సిలర్ కూడా హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

చక్రం తిప్పిన విశాఖ డెయిరీ చైర్మన్

చైర్‌పర్సన్ రమాకుమారిపై వైసీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెరవెనుక చక్రం తిప్పారు. అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన వారిలో కొంతమందిని చైర్‌పర్సన్ గూటికి రప్పించడంలో కీలకపాత్ర పోషించారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో మొత్తం 25 వార్డులకుగాను 23 వార్డుల్లో వైసీపీ గెలుపొందింది. దీంతో పిళ్లా రమాకుమారిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలో వున్నంతకాలం అంతా సాఫీగానే సాగింది. గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోవడంతో రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చైర్‌పర్సన్ రమాకుమారితోపాటు ఆమె సోదరుడు, విశాఖ డెయిరీ చైర్మన్ అయిన ఆడారి ఆనంద్‌కుమార్, వారి వర్గీయులు బీజేపీలో చేరారు. పార్టీని వీడిని రమాకుమారిపై అవిశ్వాస తీర్మానం పెట్టి, పదవి నుంచి దించేయాలన్న ... మిగతా 8వ పేజీలో

ఉపాధి కూలీలకు ఊరట

ఎట్టకేలకు అందనున్న వేతన బకాయిలు



పూడికతీత పనుల్లో ఉపాధి కూలీలు

- జిల్లాలో రూ.59 కోట్లు పెండింగ్
- ఈ ఏడాది జనవరి మూడో వారం నుంచి కూలీలకు ఆగిన చెల్లింపులు
- తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో పలుమార్లు ఆందోళనలు
- నిధులు విడుదల చేసినట్టు ఐదు రోజుల క్రితం కేంద్రం ప్రకటన
- రెండు, మూడు రోజుల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ

చోడవరం/ నర్సీపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

వేతనాల కోసం మూడు నెలల నుంచి ఎదురుచూస్తున్న ఉపాధి కూలీలకు ఎట్టకేలకు కూలి డబ్బులు అందనున్నాయి. రెండు, మూడు రోజుల్లో ఆయా కూలీల బ్యాంకు/ పోస్టల్ ఖాతాలకు వేతనాల సొమ్ము జమకానున్నది. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ ఏడాది జనవరి మూడో వారం నుంచి గత శనివారం (19వ తేదీ) వరకు రూ.59 కోట్లు పెండింగ్‌లో వున్నాయి.

అనకాపల్లి జిల్లాలో 2.82 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 2,10,239 కుటుంబాలకు పనులు కల్పించారు. గత ఏడాది డిసెంబరు వరకు రూ.350 కోట్లు వేతనాలుగా కూలీలకు చెల్లించారు. సంక్రాంతి తరువాత ఉపాధి పనులు మళ్లీ మొదలయ్యాయి. కానీ కూలీలకు ఇంతవరకు ఒక్కసారి కూడా వేతనాలు అందలేదు. వ్యవసాయ పనులు సైతం లేకపోవడంతో ఉపాధి పనులే ఆధారం అయ్యాయి. కానీ మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు వేతనాల కోసం తరచూ వినూత్న రీతుల్లో నిరసనలు తెలుపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు నెలలపాటు వేతనాలు పెండింగ్‌లో వుండడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళితే.. కొద్ది రోజుల్లోనే నిధులు విడుదల అవుతాయంటూ రెండు నెలల నుంచి చెప్పుకుంటూ వస్తున్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో పలువురు కూలీలు పనులకు రావడం మానేశారు. మొత్తం మీద ఉపాధి కూలీల బకాయిలు రూ.59 కోట్లు వున్నట్టు అధికారవర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రాష్ట్రానికి రూ.912 కోట్లు విడుదల చేస్తున్నట్టు ఐదు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో కూలీలు ఊరటచెందారు. కూలీల బ్యాంకు ఖాతాలకు జమ కావడానికి మరో రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉందని డ్వామా అధికారులు అంటున్నారు. ఇంత సుదీర్ఘకాలం వేతనాలు అందకపోవడం ఇదే ప్రథమమని చెబుతున్నారు.

రిజిస్ట్రేషన్‌ల ఆదాయం డీలా!

గత ఏడాదితో పోలిస్తే రూ.7.62 కోట్లు తక్కువ

- 2023-24లో రూ.278.86 కోట్ల ఆదాయం
- 2024-25లో రూ.270.74 కోట్లకు తగ్గుదల



అనకాపల్లిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌ల శాఖ ఆదాయం నిరాశాజనకంగా వుంది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే సుమారు ఎనిమిది కోట్ల రూపాయలు తగ్గింది. గత వైసీపీ ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకొనేందుకు భూముల ధరలను విపరీతంగా పెంచేసిందని, దీంతో ఆస్తుల క్రయవిక్రయాలు తగ్గడంతో ఆ ప్రభావం ఆదాయంపై పడిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రిజిస్ట్రేషన్‌ల శాఖలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దే చర్యలు చేపట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో భూముల రిజిస్ట్రేషన్ విలువలను సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ పెరగ్గా, మరికొన్నిచోట్ల తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో యథాస్థితిలో కొనసాగించారు. ఆస్తుల క్రయవిక్రయదారులకు మెరుగైన సేవలు అందించేందుకు రిజిస్ట్రేషన్‌లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీంతో దళారీ వ్యవస్థకు చెక్ పడుతుంది. ఈ కారణాల వల్ల 2023-24తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం స్వల్పంగా.. రూ.7.62 కోట్లు తగ్గింది. జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

జిల్లాలోని వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గత నాలుగేళ్లలో వచ్చిన ఆదాయ వివరాలు..

కార్యాలయం	2021-22	2022-23	2023-24	2024-25
అనకాపల్లి	రూ.51.04 కోట్లు	రూ.59.66 కోట్లు	రూ.66.34 కోట్లు	రూ.55.32 కోట్లు
చోడవరం	రూ.16.25 కోట్లు	రూ.14.2 కోట్లు	రూ.14.50 కోట్లు	రూ.15.85 కోట్లు
కె.కోటపాడు	రూ 5.55. కోట్లు	రూ.5.12 కోట్లు	రూ.6.15 కోట్లు	రూ.8.3 కోట్లు
కోటవురట్ల	రూ.7.19 కోట్లు	రూ.8.91 కోట్లు	రూ.10.90 కోట్లు	రూ.12.63 కోట్లు
మాడుగుల	రూ.5.44 కోట్లు	రూ.5.36 కోట్లు	రూ.5.09 కోట్లు	రూ.4.84 కోట్లు
నర్సీపట్నం	రూ.16.02 కోటు	రూ.17.81 కోట్లు	రూ.21.87 కోట్లు	రూ.21.59 కోట్లు
నక్కపల్లి	రూ.23.90 కోట్లు	రూ.25.24 కోట్లు	రూ.29.2 కోట్లు	రూ.26.86 కోట్లు
సబ్బవరం	రూ.25.25 కోట్లు	రూ.24.63 కోట్లు	రూ.24.89 కోట్లు	రూ.27.57 కోట్లు
ఎలమంచిలి	రూ.56.86 కోట్లు	రూ.41.34 కోట్లు	రూ.40.51 కోట్లు	రూ.43.58 కోట్లు
లంకెలపాలెం	రూ.47.3 కోట్లు	రూ.42.83 కోట్లు	రూ.59.01 కోట్లు	రూ.54.27 కోట్లు
మొత్తం	రూ.254.82 కోట్లు	రూ.245.09 కోట్లు	రూ.278.46 కోట్లు	రూ.270.74 కోట్లు

హౌసింగ్ ఖాళీ!

మూడు జిల్లాల్లోనూ అధికారులు, సిబ్బంది కొరత

- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉండాల్సింది 15 మంది, ఉన్నది నలుగురే...
- అసిస్టెంట్ ఇంజనీర్‌లు ఉండాల్సింది 49 మంది... ఉన్నది తొమ్మిది మాత్రమే
- వర్క్ ఇన్‌స్పెక్టర్లు 60 మందికిగాను ఉన్నది నలుగురైదుగురు
- కార్యాలయాల్లో మేనేజర్లు, అకౌంట్స్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు చాలావరకూ ఖాళీ
- అవుట్ సోర్సింగ్ సిబ్బందితో కాలక్షేపం
- ఇళ్ల నిర్మాణంలో జాప్యం



విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):

సుమారు నాలుగున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ తన ప్రాభవాన్ని కోల్పోతోంది. చాలాకాలం నుంచి నియామకాలు లేకపోవడంతో విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మూడు జిల్లాల పరిధిలో ప్రస్తుతం రెగ్యులర్ పోస్టులలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, నలుగురు డీఈలు, తొమ్మిది మంది ఏఈలు, నలుగురైదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారు. జిల్లా కార్యాలయాల్లో రెగ్యులర్ సిబ్బంది వేళ్ల మీద లెక్క పెట్టేంత మందే ఉన్నారు.

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టుల్లో రెవెన్యూ శాఖ పరిధిలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు నియమితులు కాగా అల్లూరి జిల్లా పీడీగా, ఈఈగా హౌసింగ్ డీఈ హోదా కలిగిన అధికారి వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం విశాఖ, నర్సీపట్నం డివిజన్లకు మాత్రమే ... మిగతా 8వ పేజీలో

వెంకటాపురంలో దుర్గమాంబ అమ్మవారి పండుగ రేపు

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఈనెల 24వ తేదీన దుర్గమాంబ అమ్మవారి పండగ జరగనుందని మాజీ సర్పంచ్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుందరపు వెంకట కనకఅప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రికి బుర్రకథ ప్రదర్శన ఉంటుందన్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. రాత్రికి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం మల్లవరం, నరేంద్రపురంలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు పంచదార్లలో ద్విముఖ వినాయకుని ఆలయ వార్షికోత్సవం



రాంబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పంచదార్ల ఫణిగిరిపై కొలువై ఉన్న ద్విముఖ వినాయక ఆలయం 15వ వార్షికోత్సవాన్ని ఈనెల 23న ఘనంగా నిర్వహిస్తున్నట్టు భగవత్ భక్తి ప్రచార ట్రస్టు కార్యదర్శి భాగవతుల శ్రీరామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి సన్నిధిలో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు భజన ప్రదర్శన, 8 నుంచి 10 గంటల వరకు పంచామృతాభిషేకం, 10 నుంచి 1.00 గంటల వరకు స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ద్విముఖ వినాయకుడిని దర్శించుకోవాలని శ్రీరామ్మూర్తి కోరారు.

నేడు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

రాంబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 23న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించనున్నారని టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర మంగళవారం తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని, హైస్కూల్ ఆవరణలో పీఎంశ్రీ పథకం రూ.15లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబొరేటరీ భవనం, ఉపాధి పథకం నిధులతో చేపట్టిన హైస్కూల్ కాంపౌండ్ వాల్, హైస్కూల్ ఆవరణలో నిర్మించిన బాలికల వసతి గృహం భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించనున్నారని దినబాబు, నూకన్నదొర తెలిపారు.

టీచర్ బొడ్డేడకు ఘన సత్కారం



ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనాయణను సత్కరిస్తున్న సహ ఉపాధ్యాయులు

ఎలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేసి రిలీవ్ అయిన బొడ్డేడ సత్యనారాయణను మంగళవారం సహ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యార్థుల ఉన్నతికి ఆయన అందించిన సేవలను హెచ్ఎం శాస్త్రితోపాటు పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

దళితులను వెలివేయడం హేయమైన చర్య

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితులను వెలివేయడం హేయమైన చర్య అని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు ఎక్కడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రెండు కిలోల గంజాయితో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. పెదగుమ్ములూరు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు నర్సీపట్నం వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి సోదా చేశారు. దీంతో రెండు కిలోల గంజాయి లభించింది. వీరి గురించి ఆరా తీయగా తుని పట్టణానికి చెందిన కప్పరాతి శ్రీను, రామిశెట్టి సాయిబాబాగా గుర్తించారు. చింతపల్లి మండలంలో గంజాయి కొనుగోలు చేసి తుని తీసుకెళుతున్నట్టు పోలీసుల విచారణలో చెప్పారు. నిందితులను అరెస్టు చేసి, బైక్‌ను సీజ్ చేశారు.

ప్రైవేటు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

▸▸ అడ్మిషన్ల డ్రైవ్‌లో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింట ప్రచారం



ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అడ్మిషన్ పత్రంపై సంతకం చేస్తున్న ఓ తల్లి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల వద్దు.. ప్రభుత్వ పాఠశాలే ముద్దు అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మంగళవారం అడ్మిషన్ల డ్రైవ్‌ను నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యతమైన విద్య, వసతుల గురించి వివరించారు.ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్న 20 మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అంగీకరించి, అడ్మిషన్ పత్రాలపై సంతకాలు చేసినట్టు ఉపాధ్యాయుడు గారా ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు విజయకుమారి, లలితాంబ, కుసుమకుమారి, అరుణ, విమలాదేవి, కృష్ణవేణి, దీపిక, కరుణ, శోభారాణి పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట గృహిణి ఆందోళన

▸▸ భూ వివాదం పరిష్కరించకుంటే ఆత్మాహుతి చేసుకుంటానని హెచ్చరిక

▸▸ సివిల్ కోర్టులో సమస్య పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న రాధ

రాంబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచదార్ల పరిధిలో తమ పూర్వీకులకు సంబంధించిన భూముల వివాదం తీర్చకుంటే పెట్రోల్‌తో ఆత్మాహుతి చేసుకుంటానని రాధ అనే గృహిణి మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు బైటాయించింది. సర్వే నంబరు 76/2లో గల నారాయణరావు, వీరస్వామి, ధర్మలింగంలకు వారసత్వంగా వచ్చిన భూమిపై వారసులుగా రికార్డులను ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇదే గ్రామానికి చెందిన ఒక మండల నాయకుడు తమ భూమిపై కన్నేసి తమకు హక్కుగా రాకుండా అధికారులతో కలిసి అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. మంగళవారం తహసీల్దార్‌ను కలిసి న్యాయం చేయాలని కోరగా.. సమాధానం చెప్పే అవసరం మాకు లేదంటూ గట్టిగా మాట్లాడి పంపించి వేశారన్నారు. న్యాయం చేయకుంటే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మాహుతి చేసుకుంటానని ఆమె బెదిరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా.. సివిల్ వివాదాలు కోర్టులో పరిష్కరించుకోవాలని ఆమెకు సూచించానని తెలిపారు. పంపకాలు జరిగినట్టు రిజిస్ట్రేషన్ కాని ఒక కాగితాన్ని తీసుకుని వచ్చి ఆన్‌లైన్ చేయాలని తనపై వత్తిడి చేస్తున్నారన్నారు. అన్నదమ్ముల మధ్య పంపకాలలో ఇది తప్పుడు డాక్యుమెంటు అని ఒకరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారన్నారు. ఈ సమస్యను సివిల్ కోర్టులో సమస్య పరిష్కరించుకోవాలని సూచించానని తెలిపారు.

కైలాసపట్నం ఘటనకు అధికారులదే బాధ్యత

▸▸ మండల సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యులు ఉమాదేవి

కోటవురట్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కైలాసపట్నంలో ఇటీవల బాణసంచా తయారీ కర్మాగారంలో పేలుడులో నిర్వాహకులు, అధికారుల నిర్లక్ష్యంపై జడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కైలాసపట్నం ఘటనలో పది మంది మృతిచెందడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందించడం భావ్యం కాదన్నారు. బాణసంచా కర్మాగారం నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారా.. లేదా.. అని అధికారులు ముందుగా పర్యవేక్షణ చేయకపోవడమే ప్రమాదానికి కారణమన్నారు. ఈ విషయమై తహసీల్దార్ తిరుమలబాబు మాట్లాడుతూ కైలాసపట్నం వంటి బాణసంచా ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. యండపల్లిలో మరో బాణసంచా కర్మాగారం ఉందని, అక్కడ ఇలాంటి ఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన నిఘా, తనిఖీలు చేపడతామన్నారు. ఉపాధి హామీ ఏపీవో నాగరాజు మాట్లాడుతూ మండలంలో 11 వారాల నుంచి కూలీలకు వేతనాలు మంజూరు కాలేదన్నారు. కూలీలకు వేతన బకాయిలు రూ.4.24 కోట్లు కాగా, మెటీరియల్‌కు రూ1.92 బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెలాఖరునాటికి చెల్లింపులు చేసే అవకాశం ఉందన్నారు. నీలిగుంట సర్పంచ్ వరహాలబాబు మాట్లాడుతూ గ్రామంలో వీఆర్‌పీ మార్పు కారణంగా 400 మంది కూలీలకు పనులు లేవన్నారు. ఇన్‌చార్జి వీఆర్‌పీ వారం రోజుల నుంచి కూలీలకు పనులు కల్పించడం లేదన్నారు. ఈ విషయమై బీకేపల్లి సర్పంచ్ లింగం నాయుడు కలుగుజేసుకుని వీఆర్‌పీని బెదిరించడం వల్ల ఆయన రావడం లేదన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు సర్పంచుల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో చెరువు ఆక్రమణలకు గురైందన్నారు. సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు తెలిపారు. ఈ సమావేశానికి ఆశించిన స్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ సాగి సీతబాబు (దత్తుడు), ఎంపీడీవో కాశీవిశ్వనాథం, ఎంఈవోలు రామారావు, జోషి, ప్రాజెక్టు ఏఈ సత్యనారాయణ, మండల ఏఈ వర్మ తదితరులు పాల్గొన్నారు.

జెట్టీ పూర్తయ్యే వరకు నెలకు రూ. 40 వేలు పరిహారం ఇవ్వాలి

▸▸ బంగారమ్మపాలెం ఎన్ఏవోబీ నిర్వాసితుల డిమాండ్



ఎన్ఏవోబీ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎస్‌డీసీ మనోరమ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెంలో ఎన్ఏవోబీ నిర్వాసితులతో మంగళవారం ఎన్ఏవోబీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ఎన్ఏవోబీ నిర్మాణంలో భాగంగా తమ బోట్లను మరో ప్రదేశానికి తరలించడం వలన జీవనోపాధి కోల్పోవడం జరుగుతుందన్నారు. తమకు అనుకూలమైన జెట్టీ నిర్మాణం పూర్తయ్యేంత వరకు ప్రతీ మత్స్యకార కుటుంబ పెద్దకు నెలకు రూ నలభై వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమండ్ చేశారు. అలాగే తమ గ్రామాన్ని మరోచోటకు పూర్తిగా తరలించడంపై స్పష్టత ఇవ్వాలన్నారు. వాటితో తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మత్స్యకారులు తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు నేవీ వారు నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపివేయాలన్నారు. దీనిపై ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ మాట్లాడుతూ మత్స్యకారుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషరిస్ జేడీ ప్రసాద్, ఎస్ఐ విభీషణరావు,గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.

నాగరాజుపేట రైల్వే గేటు మూడు రోజులు మూసివేత



నాగరాజుపేట రైల్వే గేటు మూసివేసి పనులు చేస్తున్న దృశ్యం



రైల్వే అధికారులు గేటు వద్ద ఏర్పాటుచేసిన బోర్డు

పాయకరావుపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగరాజుపేట రైల్వే గేటు వార్షిక నిర్వహణలో భాగంగా రైల్వే అధికారులు గేటును మంగళవారం మూసివేసి మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పనులు మూడు రోజులపాటు నిర్వహించనుండడంతో అంతవరకు పట్టణంలో ప్రజలు రైలు పట్టాలు దాటాలంటే రెండు కిలోమీటర్లు చుట్టూ ప్రయాణించాల్సి ఉంటుంది. పట్టణంలో మధ్యగా ఉన్న రైల్వే పట్టాలు దాటి ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగించాలంటే స్థానిక నాగరాజుపేట రైల్వే గేటు ప్రధాన మార్గం. ముఖ్యంగా ఉదయం సాయంత్రం సమయంలో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుండడంతో ఆయా సమయాల్లో రద్దీగా ఉంటుంది. ఇప్పుడు రైల్వే గేటు మరమ్మతు పనులు చేపట్టిన కారణంగా ఈనెల 26వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మూసి ఉండడంతో అంతవరకు పట్టణంలో ప్రజలు రైలు పట్టాలు దాటాలంటే స్థానిక వైజంక్షన్ మీదుగా లేదా తాండవ నది అవతల ఉన్న తుని పట్టణం మీదుగా సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది.

నూర్పిడి యంత్రాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారులు

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చూచుకొండ గ్రామంలో సబ్సిడీపై రైతు తీసుకున్న నూర్పిడి యంత్రాన్ని వ్యవసాయ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ ఏడీఏ ఆర్.శశిధర్‌రెడ్డి, ఏవో వి.సురేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి సిహెచ్.జ్యోత్స్నకుమారి తదితరులు మంగళవారం చూచుకొండ, మెలిపాక గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల సబ్సిడీపై నూర్పిడి యంత్రాన్ని తీసుకున్న పెంటకోట శివ వెంకట అప్పారావును కలిశారు. ఈ సందర్భంగా రైతు వెంకట అప్పారావు మాట్లాడుతూ రూ.2.48లక్షలు ఖరీదైన యంత్రాన్ని తీసుకున్నానని చెప్పారు. ప్రభుత్వం నుంచి రూ.80వేలు రాయితీ లభించిందన్నారు. ఎకరా విస్తీర్ణంలో ఉన్న వరి పొలాన్ని ఒక గంటలో నూర్పిడి అవుతోందన్నారు. గంటకు రూ.1,200 తీసుకుంటున్నానని తెలిపారు. లాభదాయకంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

రజకులను ఎస్సీలుగా గుర్తించాలి

▸▸ సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

చోడవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీలుగా గుర్తించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామకోటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక బానయ్యకోనేరు ప్రాంతంలో నిర్వహించిన రజక సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. రజకులకు ఇళ్ల పట్టాలు మంజూరుతోపాటు, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛను మంజూరు చేయాలని కోరారు. అసంపూర్తి దోబీఘాట్‌ల పూర్తికి నిధులు మంజూరు చేయాలన్నారు. చోడవరంలో రజకులకు కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టులలో రజకులకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో రజకులను శాశ్వత ప్రాతిపదికన దోబీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు. ఈ సభకు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభలో రజక ఫెడరేషన్ నాయకులు పొన్నూరు మోహనరావు, రాజమండ్రి నారాయణ, జయనాద్ తదితరులు పాల్గొన్నారు.

రామనామంతో మార్మోగిన గ్రామాలు

రాంబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రామరక్ష రథయాత్ర మంగళవారం మండలంలో ప్రారంభమైయ్యింది. ఈ కార్యక్రమాన్ని ఎలమంచిలి పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పి.రమాకుమారి ప్రారంభించారు. ఆర్. నర్సాపురం, కృష్ణంపాలెం, సంతపాలెం, అప్పన్నపాలెం, కొండవారపాలెం గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర కన్నుల పండుగగా జరిగింది. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీరామరక్ష రథానికి హారతులిచ్చి గ్రామాల్లోకి స్వాగతించారు. భక్తులు శ్రీరామ నామం జపిస్తూ భజనలు, కోలాటాలు ప్రదర్శన చేశారు.

మరో ఐదు రోజులుపాటు మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజాన సన్యాసినాయుడు, వర్మ, గోవింద రెడ్డి, చింతకాయల రాజు, పలు పంచాయతీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నల్లమట్టిపాలెంలో ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నక్కపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తమకుతాగునీరు ఇచ్చి ఆదుకోవాలంటూ మండలంలోని నల్లమట్టిపాలెం గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు ఆందోళన చేశారు. మంగళవారం వారు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. కోటవురట్ల మండలం గొట్టివాడ నీటి పథకం నుంచి పైపులైన్ల ద్వారా తమ కాలనీకి సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తి శివారు జీపీ అగ్రహారంలో నూకాలమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంపచాయతీ పరిధిలోని గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు ఇచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, టీడీపీ నాయకులు రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, పోలవరపు నాగరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలో నిషాల్ ప్రతిభ

▸▸ జనవిజ్ఞాన వేదిక పోటీలలో ద్వితీయ బహుమతి



జనవిజ్ఞాన వేదిక ద్వితీయ బహుమతిని నిషాల్‌కు ప్రదానం చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట అప్పారావు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 22, (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన మూడో రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో మండలంలోని యర్రవరంలో గల డీపాల్ స్కూల్ విద్యార్థి నిషాల్‌కు ద్వితీయ స్థానం సంపాదించుకున్నాడు. రాష్ట్రస్థాయిలో వివిధ విభాగాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాల వీడియోలలో గుంటూరు జిల్లా సీతారామ పబ్లిక్ స్కూల్‌కు చెందిన తుమ్మల ఆదిత్య, బెహరా సందీప్‌లు ప్రథమ స్థానంలో, ఎన్‌టీఆర్ జిల్లా వీపీఎస్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన కాకర్ల అశ్వినీ సాయి తృతీయ స్థానం నిలిచారు. నిషాల్ ఉత్తమ ప్రతిభ కనపరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచడానికి సహకారం అందించిన ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని ప్రిన్సిపాల్ ఫాదర్ రాయ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తుల రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం : తహసీల్దార్



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆది మహేశ్వరరావు

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలని, బాల్య వివాహాలు చేయడం నేరమని తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలో మెలిపాక, చెర్లోపాలెం గ్రామాల్లో మంగళవారం బాలల రక్షణ, సంక్షేమ కమిటీలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై వేధింపులు జరిగితే కమిటీ దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం కార్యకర్త కేఎల్‌వీ.రమ్య కమిటీ విధి, విధానాలు, ప్రయోజనాలు గురించి తెలియజేశారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలకు అనుగుణంగా 11 మందితో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

జెడ్పీ హైస్కూల్‌కు వాటర్ ప్యూర్ ఫైర్ వితరణ



మునగపాక జడ్పీ హైస్కూల్‌కు ఆర్‌వో ప్యూర్ ఫైర్ అందజేసిన వీఏహెచ్ఐ సంస్థ ప్రతినిధులు

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎనిమల్ హెల్త్ ఇండియా సంస్థ వాటర్ ప్యూర్ ఫైర్‌ను అందజేసిందని హెచ్.ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సంస్థ ఏబీఎం కె.రంగాచారి, బీవో బి.సంతోష్, మండల పశు వైద్యాధికారి కుమార్ మంగళవారం వాటర్ ప్యూర్ ఫైర్‌ను హెచ్ఎంకు అందజేశారు. అదేవిధంగా ఇదే పాఠశాలకు చెందిన 1998-99 పదో తరగతి పూర్వపు విద్యార్థులు ఐదు సీలింగ్ ఫ్యాన్‌లను పాఠశాల కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు ద్వారా అందజేశారు.



రాయితీపై పనిముట్లు అందజేస్తున్న వ్యవసాయాధికారులు, నాయకులు

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

» తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ

నాతవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నదని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని మర్రిపాలెం గ్రామంలో మంగళవారం రాయితీపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ధాన్యం రైతులకు రెండు రోజుల్లో ప్రభుత్వం ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శైలజ, ఎంపీపీ ఎవి.విజయకుమార్, సింగంపల్లి సన్యాసినాయుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొండ్రు మరిడియ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు జటంశెట్టి సీతారామూర్తి, వెలగా వెంకటకృష్ణారావు, శెట్టి లోవ, బంగారు సూరిబాబు, జేరెడ్డి రాజబాబు, శెట్టి గోపి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గొలుగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ చెప్పారు. మండలంలో నిర్వహిస్తున్న పోషణ పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గొలుగొండ వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అందుబాటులో ఉండే ఆహారాలను ఎక్కువగా తినాలని, ఇవి ఎంతో మేలు చేకూరుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజ్, స్పెషల్ సీడీపీవో శ్రీగౌరి, వెలుగు ఏపీఎం కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: పోషకాహారం అందించినప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, శిశుమరణాలు కూడా తగ్గుతాయని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితమైన మెనూ తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే ఐసీడీఎస్ సిబ్బంది సూచనలు పాటించాలని కోరారు. తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ వివిధ రకాల పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, విజయలక్ష్మి, వెలుగు ఏపీఎం అరుణకుమారి, నాయకులు వెలగా వెంకటకృష్ణారావు, బంగారు సూరిబాబు, చెక్కా ప్రభావతి, జోగిరాజు పాల్గొన్నారు.

శివారు గ్రామాలకు మహర్దశ

గొలుగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శివారు గ్రామాలకు మహర్దశ పట్టింది. మట్టి మార్గాలు కాస్త సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చెందాయి. దీంతో దాదాపు 13 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరాయి.

టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన పదినెలల్లోనే మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మూడు పాఠశాలల అభివృద్ధికి స్కీక్ (?) ఆయ్యాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ.1.5 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో పాతమల్లంపేట గ్రామ పంచాయతీలోని 13 గ్రామాల్లో మట్టి మార్గాలను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ఉగ్గంపేట, ద్వారకానగరం, కొత్తపాలెం, బుడ్డపాడు, అంటిమామిడిపాలెం, గుంపాలెం, పెదగరుడుపాలెం, పోలవరం, వరకల గడబపాలెంతో పాటు మరో నాలుగు శివారు గ్రామాల్లో రహదారులు దశ మారిపోయింది. చినుకు పడితే ఈ మార్గాలు చిత్తడి కావడంతో ఆయా గ్రామాల ప్రజలు పడరాని పాట్లు పడేవారు. రహపోకలకు ప్రత్యక్ష నరకం చవిచూసేవారు. కూటమి ప్రభుత్వ హయాంలో అతి తక్కువ కాలంలోనే రహదారుల రూపురేఖలు మారిపోయాయి. సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, టీడీపీ నాయకుడు గెడ్డం ఆనంద్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని మట్టిమార్గాలు సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చెందాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్ రోడ్లుగా మట్టి మార్గాల అభివృద్ధి
13 గ్రామాల ప్రజలకు తీరిన రవాణా కష్టాలు





పాతమల్లంపేటలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



పంచాయతీలోని మరో గ్రామంలో సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చెందనున్న మరో మట్టి మార్గం

రజకులను ఎస్సీలుగా గుర్తించాలి

» రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

చోడవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీలుగా గుర్తించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామకోటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక బాలయ్యకోనేరు ప్రాంతంలో నిర్వహించిన రజక సంఘం మహాసభలో ఆయన మాట్లాడారు. రజకులకు ఇళ్ల పట్టాలు మంజూరుతోపాటు, 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛను మంజూరు చేయాలని కోరారు. ఆసుపత్రి దోబీఘాట్ పూర్తికి నిధులు మంజూరు చేయాలన్నారు. చోడవరంలో రజకులకు కల్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అవకాశం ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో రజకులను శాశ్వత ప్రాతిపదికన దోబీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానాలు ఆమోదించారు. ఈ సభకు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామప్పారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సభలో రజక ఫెడరేషన్ నాయకులు పొన్నూరు మోహనరావు, రాజమండ్రి నారాయణ, జయనాథ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, కర్రి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



రజక మహాసభలో పాల్గొన్న ముఖ్య అతిథులు

'గ్రామ స్థాయిలో టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి'

గొలుగొండ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో పార్టీ పటిష్ఠతకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ నాయకుడు, ఐడీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాలు వద్ద మంగళవారం టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 10800 మంది టీడీపీ సభ్యత్వం పొందారన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా కార్యకర్తలకు త్వరితగతిన కార్డులు అందించాలని సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని ఏఎల్‌పురంలో 1623 మందిని సభ్యులుగా చేర్చి మొదటి స్థానంలో ఉన్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు ఎ.అప్పలనాయుడు, ఆడపురెడ్డి గోపి, కొల్లి సత్యనారాయణ, కామిరెడ్డి గోవింద, కర్రి నాయుడు, కె.రవిబాబు, కొల్లి రాంబాబు, పి.రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకోండి

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వై.తారకేశ్వరరావు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో 32 మంది విద్యార్థులతో పాటు డీఎస్సీ అభ్యర్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ కోసం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. అలాగే పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నానిబాబు, రాజేశ్, రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎస్ఐ తారకేశ్వరరావు

ఘనంగా గంగాలమ్మతల్లి పండగ

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగసింగి గ్రామంలో మంగళవారం గంగాలమ్మతల్లి పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ యలమంచిలి సూర్యకాంతం, టీడీపీ నాయకులు యలమంచిలి వరహాలబాబు ఆధ్వర్యంలో పండగ జరిగింది. భక్తులు పసుపు కుంకుమ సమర్పించి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లేశ్, సత్యనారాయణ, జనసేన నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కొంగసింగి గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామ మాజీ సర్పంచ్ వెల్లూరి సత్యనారాయణ తెలిపారు. గ్రామ ముఖద్వారం వద్ద శివాలయంలో భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తామని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నాతవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంగాలమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. యాదవులు గంగాలమ్మతల్లి ఆలయానికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆలయం వద్ద యాదవులు తప్పెటగుళ్ల ప్రదర్శన అద్భుతంగా ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు క్యూలో నిల్చొని అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, టీడీపీ నేత శెట్టి నానాజీ అమ్మవారికి పూజలు చేశారు.

చెర్లోపాలెం మాజీ సర్పంచ్ మృతి

నాతవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి వెంకటరమణ మంగళవారం మృతి చెందారు. గుండె నొప్పి రావడంతో వెంకటరమణను కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వెంకటరమణ మరణించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి గ్రామంలో బుధవారి చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ దిబ్బిడి గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యాబోధన, సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్డి మాణిక్యం, ఎంపీటీసీ సభ్యుడు గొంప చినబాబు, విద్యా కమిటీ చైర్మన్ మండపాక శివ, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, సేనాపతి శ్రీనివాసరావు, పెదిరెడ్డి రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రతిభా విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతులను అందిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

రోలుగుంట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : రోలుగుంట జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో స్టేట్ ఫస్ట్ (986/1000) మార్కులు సాధించిన ఎం.గౌతమికి రూ.5వేలు, కళాశాల టాపర్‌లకు ఆర్.భారతికి రూ.2వేలు, ఆర్.దుర్గాభవానికి రూ.2వేలు, కె.జానకికి రూ.2వేలు, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కళాశాల టాపర్‌లకు ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున నగదును విశ్రాంత ఉపాధ్యాయులు సిహెచ్ అప్పలస్వామి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలరాజు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మకు ఘటాల పండగ

మాడుగుల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల ఇలవేల్పు మోదకొండమ్మ అమ్మవారి ఘటాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి 108 ఘటాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. అలాగే గ్రామంలోని పలువురు భక్తులు ఘటాల పండగ జరుపుకున్నారు. దీంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

సబ్సిడీ యంత్రాలను పరిశీలించిన అధికారులు



మాడుగుల యంత్రాలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

దేవరాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆహార, పోషణ భద్రత పథకం కింద మండలంలో ఎంఏ.ఆమరదేవ్ పంపిణీ చేసిన సబ్సిడీ యంత్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.శశిధరరెడ్డి మంగళవారం పరిశీలించారు. యంత్రం ఖరీదు, ప్రభుత్వ సబ్సిడీ, మెషీన్ ఉపయోగాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారులు వి.సురేషుబాబు, ఆర్.గాయత్రి, ఎల్.వై.కాంతమ్మ పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



చిత్ర లేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

దేవరాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి చిత్ర లేఖనం పోటీల్లో తెనుగుపూడి గురుకుల విద్యార్థులు ప్రతిభ సాధించారు. గత నెలలో విజయవాడలో జరిగిన పోటీల్లో ఎస్.రాజకుమార్, కె.మదన్, వైసారెడ్డి, జి.జగదీష్, పి.విజయ్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. అలాగే జి.కృష్ణ, కౌశిక్, ఎం.హర్షిత్, సిహెచ్ బుజ్జిరాజు, ఎ.నిరంజన్, జి.నిఖిల్, అభిషేక్, ఎం.చరణ్‌తేజ, ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ పి.రాము, ఆర్ట్ ఉపాధ్యాయుడు అర్జునరావు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం కింతాడ పంచాయతీ బొట్లవానిపాలెం, కింతాడ బత్తివానిపాలెం, గొల్లలపాలెం పాఠశాలల్లో నూతనంగా నిర్మించిన ప్రహరీలను, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ. కోటి 32 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ డార్మెటరీ అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్లస్టర్ ఇన్‌ఛార్జి కస్తూరు సూర్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో బండారు మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.19 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో ఒక్క మాడుగుల నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్లు తగ్గించేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావునాయుడు మాట్లాడుతూ జిల్లాలో అతి తక్కువ సమయంలో కంప్యూటర్ డార్మెటరీ గదులను నిర్మించిన ఘనత గొల్లలపాలెం కేజీబీవీ పాఠశాలకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ పీవీజీ కుమార్, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు వానిరెడ్డి ఏసునాయుడు, టీడీపీ మండల ప్రెసిడెంట్ రొంగలి మహేష్, టీడీపీ నాయకులు దాడి ఎరుకునాయుడు, సబ్బవరపు రామునాయుడు, జూరెడ్డి రాము, బండారు నరసింహనాయుడు, బత్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కింతాడ కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అధికారులు ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలి

» ఎమ్మెల్యే బండారు

దేవరాపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలకు విధిగా ప్రొటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బి.కింతాడ సర్పంచ్ బూరేబాబూరావు మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీకి సంబంధం లేకుండా విద్యుత్ శాఖ ఖర్చు చేసి ఎంత ఖర్చు అయిందో.. ఎంత మిగిలింది.. చెప్పలేదని, కనీసం సర్పంచ్‌కు తెలియకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఏఈకు కర్రి శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఖర్చు చేసిన నిధులు ఇష్టానుసారం బదులిస్తారు. దాన్యం సర్పంచి మిషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చారని బాబూరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారిణి ఎల్‌వై.కాంతమ్మ సమాధానమిస్తూ ఆగ్రామ రైతుకు నిబంధనల ప్రకారం ఇచ్చామన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు చెప్పడం లేదంటూ సభ దృష్టికి తీసుకు రావడంతో ఎమ్మెల్యే స్పందిస్తూ విధిగా అధికారులు ప్రొటోకాల్ పాటించాలన్నారు. గర్సింగి, ఏతేశ్వరపల్లెలో, బి.కింతాడ అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మించాలని ఆయా సర్పంచులు గుడెపురాము, సత్యవెంకటరమణ, బాబూరావు కోరారు. వైదాడ సర్పంచ్ చల్లా లక్ష్మి మాట్లాడుతూ చెక్కులపై తన సంతకాలు చేయించి అధికారులు చేసిన తప్పులకు రూ.2.35 లక్షలు తనను కట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. దీనిపై విచారణ చేయాలని ఈవోపీఆర్డీని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, ఎంపీడీఓ సువర్ణరాజు, తహసీల్దార్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

ప్రసాద్ మాస్టర్ సేవలు ఎనలేనివి : రఘువర్మ

చీడికాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో లెక్కల ప్రసాద్ మాస్టర్ సేవలు ఎనలేనివని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండలంలోని అర్జునగిరి యూపీ స్కూల్ హెచ్ఎం లెక్కల ప్రసాద్ మాస్టారు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ఆవరణలో ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే ఏ విధంగా భవిష్యత్తు ఉంటుందో పిల్లల తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువచ్చి అధిక సంఖ్యలో చేర్పించిన ఘనత ప్రసాద్ మాస్టారికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటపతిరాజు, సంఘ ఉపాధ్యక్షుడు తమరాన శ్రీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీఎస్.నాయుడు, పి.వరహామూర్తి మాట్లాడారు. అనంతరం ప్రసాద్ మాస్టారు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోతల రమణయ్య, గండి మూసలినాయుడు, యర్రా అప్పారావు, పరవాద మహేష్ పాల్గొన్నారు.



టీచర్లను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

నేడు మాడుగులలో
ఉచిత దంత వైద్య శిబిరం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 22 : మాడుగులలోని వైభవ సీతారామాలయం వద్ద బుధవారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు రొంటి రామకొండరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందని, సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి దంత వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 9885650716 నంబరుని సంప్రదించాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్ అప్పలరాజుకు ఘన సన్మానం



అప్పలరాజుని సన్మానిస్తున్న వీరవల్లి అగ్రహారం నాయకులు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజును వీరవల్లి అగ్రహారం కూటమి నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. మాడుగులలోని అప్పలరాజు స్వగృహంలో ఆయ నకు దుశ్శాలువాలతో సత్కరించారు. పూలమాలలు, శాలువ కప్పి సన్మానం చేశారు. ఏఎంసీ చైర్మన్‌గా తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తా.. రైతులకు సేవలు అందిస్తానని అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వడ దెబ్బ బారిన పడకుండా జాగ్రత్త పడాలి

రావికమతం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లేవారు ఎండలకు వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారి సురేశ్ సూచించారు. మంగళవారం చీమలపాడు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వంద మందికి ఆమె పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పొలం, ఉపాధి పనులలో పాల్గొనేవారు ఓఆర్ఎస్‌,మంచినీరు తాగుతూ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పి జోషి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంపై ప్రజల్లో చైతన్యం తేవాలి

రావికమతం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కాలుష్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు కోరారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ శాఖల సిబ్బందికి కాలుష్యానికి గురవుతున్న ధరిత్రిపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్లాస్టిక్, రసాయన, వాయు కాలుష్యాన్ని తగ్గించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో సీతారామస్వామి, ఈవోపీఆర్డీ భానోజీరావు పాల్గొన్నారు.

కొవ్వూరు వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

రోలుగుంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు వృద్ధాశ్రమంలో మంగళవారం రోలుగుంట పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధనలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వైద్యులు విద్యాసాగర్(ఆర్థోపెడిక్), జి.లత(జనరల్ మెడిసిన్)లతో 25 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు రూ.5.34 కోట్లు

రోలుగుంట, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి కూలీలకు వేతన బకాయిలు రూ.5.34 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఏపీవో ఈశ్వరరావు తెలిపారు. గత 11 వారాలుగా ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారని, వీరి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. వారం రోజుల్లో వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నట్టు తెలిపారు.

ఎం.కోడూరు ఆలయానికి రూ.10వేలు విరాళం

మాడుగుల రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం అభివృద్ధికి పాడేరుకి చెందిన బత్తుల నవర బబ్బు రూ.10వేలు విరాళంగా అందించారు. ఈ నగదును గ్రామ సర్పంచ్ గొల్లలపల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి ఘటాలను సమర్పించేందుకు వెళుతున్న భక్తులు


నెల్లూరుకు చెందిన కళాకారులు కాంతార నృత్య ప్రదర్శన

వైభవంగా ఎర్రగొండమ్మ జాతర

కొయ్యూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): శరభన్నపాలెం- నడింపాలెం గ్రామాల మధ్య వెలసిన ఎర్రగొండమ్మ జాతర ఆలయ కమిటీ చైర్మన్ మహేశ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా మూడవరోజు మంగళవారం సాయంత్రం నడింపాలెం, బట్టపణుకుల, శరభన్నపాలెం, వెలగలపాలెం పంచాయతీలకు చెందిన వందలాది మంది భక్తులు ఉపవాస దీక్షలతో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా నెల్లూరుకు చెందిన కళాకారులతో కాంతార నృత్యప్రదర్శన, అమ్మశక్తి వేషధారణలతో నృత్యప్రదర్శనలు, విశాఖపట్నంకు చెందిన మహిళ ట్రూప్ తో తీన్‌మార్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలో వందలాది మంది భక్తులు పలు మండలాల నుంచి తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్‌మహేశ్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, మాజీ ఎంపీ జి. మాధవి దంపతులు, గ్రామస్థుల ఆర్థిక సాయంతో ఈజాతర నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్‌జేడీ

పాడేరురూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం కళాశాలల విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణిని సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులకు పలుసూచనలు చేశారు. ఇటీవల కళాశాలకు నేక్‌లో బీ++ గ్రేడ్ రావడంపై ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు,అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపకులు సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ అధ్యాపకులు మురళీధరరావు, అప్పలనాయుడు, రవేశ్‌బాబు, అచ్యుత్ పాల్గొన్నారు.


ఆర్‌జేడీ సన్మానిస్తున్న అధ్యాపకులు

మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

గౌరవ వేతనం మంజూరుపై పాస్టర్ల హర్షాతిరేకాలు

పాడేరురూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గౌరవ వేతనాన్ని మంజూరుచేసిన మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాస్టర్లు మంగళవారం పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. యువగళం పాదయాత్ర సమయంలో లోకేశ్ పాస్టర్లకు ఇచ్చిన హామీ ఇచ్చారు. ఈ మేరకు గుడ్‌ఫ్రైడే సందర్భంగా పాస్టర్ల గౌరవ వేతనం చెల్లింపునకు రూ. 30 కోట్ల నిధుల విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యం మంగళవారం పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పాస్టర్లు ఎం.బాబూరావు, పి.ఫ్రెడ్రిక్, జి.తిమోతీ, వైవై. రత్నం, ఎం.డానియల్, వి.మత్స్యరాజు, పి.డేవిడ్, యూసీవైఏ ప్రతినిధులు కె.సత్యారావు, ఎంస్టీవెన్ శ్రీనివాస్, డి.రవికుమార్ తదితరులు పాల్గొని పాలాభిషేకం చేపటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బొర్రా విజయ రాణి, డప్పోడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పాస్టర్లు

ముత్యాలమ్మ జాతరను విజయవంతం చేయాలి: ఎంపీ

చింతపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ జాతరను భక్తులు విజయవంతం చేయాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజరాణి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పాడేరులో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో కలిసి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ, జెడ్పీచైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనుష దేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయక రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు: సీఐ

జాతరలో ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24తేదీ నుంచి 27 వరకు ప్రతి రోజు సాయంత్రం మూడు గంటల నుంచి మరుసటిరోజు ఉదయం ఆరు గంటల వరకు చింతపల్లి గ్రామంలోపలికి వాహనాల ప్రవేశాన్ని నిషేధించినట్టు చెప్పారు. నర్సీపట్నం, లంబసింగి, పాడేరు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఏపీ గురుకులం కళాశాల మైదానంలో, జీకేవీధి, సీలేరు, పెదవలస, కృష్ణాదేవి పేట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు జడ్పీ అతిథి గృహం సమీప మైదానం, జర్రెల, చెరుకుంపాకలు, పాడేరు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పార్కు చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా వాహనాలను పార్కుచేయరాదన్నారు. వ్యాపారులు ప్రధాన రోడ్డుకు రెండు మీటర్ల దూరంలోదుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ తనుజరాణి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు అనధికార సెలవులపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బాలికల ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్‌తో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు అనధికార సెలవులు కేటాయింపుపై చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి మంగళవారం విచారణ చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు గుడ్‌ఫ్రైడే నుంచి విద్యార్థులను గృహాలకు పంపిచేస్తున్నారు. దీంతో మంగళవారం 'ఆశ్రమ విద్యార్థులకు అనధికార సెలవులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వార్తా కథనం ప్రచురించింది. దీనిపై కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్, జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ సీరియస్‌గా తీసుకున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ రజినిని ఆదేశించారు. ఈ మేరకు స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలను చింతపల్లి ఏటీడబ్ల్యూవో సందర్శించారు. విద్యార్థుల హాజరు, ముందుగా విద్యార్థులనుగృహాలకు పంపడానికి గల కారణాలపై హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్‌లతో విచారించారు. ఈసందర్భంగా ఏటీడబ్ల్యూవో విలేకరులతో మాట్లాడుతూ విచారణ నివేదిక కలెక్టర్, పీవోకి అందజేస్తామని, తదుపరి చర్యలు అధికారులు తీసుకుంటారని ఆమె తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులో ప్రతిభ


ఐటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుమమాధురి, ఇన్‌స్ట్రక్టర్ నీలిమ

చింతపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి కస్తూర్బాగాంధీ విద్యార్థినులు సమాచార సాంకేతికత (ఐటీ) వృత్తి విద్యలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. పది, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు గ్రామ సచివాలయంలో పది రోజులపాటు ఐటీ కోర్సులో శిక్షణ పొందారు. ఈ కోర్సులో రాణించిన విద్యార్థినులకు మంగళవారం ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుమ మాధురి, ఐటీ ఇన్‌స్ట్రక్టర్ ఎం.నీలిమ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై అవగాహన ర్యాలీ

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలోమంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సేం ద్రియ సాగుతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధ్యమని వివరించారు. విత్తన గుళికలు తయారీ, విత్తనాలు వెదజల్లే పద్ధతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్‌పీ సత్యనారాయణ, వెలుగు వీవోఏ రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, టీడీపీ నేత మజ్జి చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండ ప్రారంభం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా రచ్చబండలు నిలుస్తాయని గసభ సర్పంచ్ సునీత అన్నారు. పంచాయతీ పరిధి మొర్రీగుడలో 15 ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన రచ్చబండను ప్రారంభించారు.గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, వార్డు సభ్యులు సత్యనారాయణ, రాజ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

25న మెగా క్రికెట్ టోర్నమెంట్

అనంతగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ గ్రామంలోని ఈనెల 25 నుంచి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు క్రీడాకారులు రాజు, దాసు, తదితరులు పేర్కొన్నారు.. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5 అందించనున్నట్టు చెప్పారు. క్రీడకారులు ఫోన్లు: 8008799562, 8179406248, 9381188620 సంప్రదించాలని కోరారు.

నెల ముగుస్తున్నా అందని రేషన్ బియ్యం

» జీసీసీ అధికారులు నిర్లక్ష్యం.. » గిరిజనుల ఆందోళన

పెదబయలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీసీసీ ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం నెలాఖరవుతున్నా పలు డీఆర్ డిపోల పరిధిలో గ్రామాల లబ్ధిదారులకు పంపిణీ కాలేదు. ఒకటోతేదీకి ముందు పంపించాల్సిన బియ్యాన్ని ఈ నెల 19,20 తేదీల్లో పెదబయలు గోదాం నుంచి సరఫరా చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో రేషన్ బియ్యంపై ఆధార పడి జీవిస్తున్న పలు గ్రామాల్లో గిరిజనులు ఆకలితో అలమటిస్తున్నారు. నిబంధనల ప్రకారంగా ప్రతీ నెలా 17వ తేదీలోపే లబ్ధిదారులకు రేషన్ సరకులు సరఫరా చేసి లాగిన్ క్లోజ్ చేసి వచ్చే నెలకు అవసరమైన ఇండెంట్ పెట్టు కోవాలి. కానీ, మండలంలో కొరవంగి, కుంతుర్ల, సంపంగిపుట్టు, బర్రెమామిడి డిపోల పరిధిలోని గ్రామాల రేషన్ కార్డుదారులకు నేటికీ పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీ చేయలేదు. కొరవంగి డిపో పరిధిలో మంగళవారం రేషన్ అందించారు. ఇంకా పలు డిపోలనుంచి పూర్తి స్థాయిలో ఏప్రిల్ నెల రేషన్ బియ్యం తరలించలేదు. దీంతో కుంతుర్ల పంచాయతీలోని కె. బొడ్డాపుట్టు గ్రామస్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. సంపంగిపుట్టు డిపో పరిధిలోని కిండలం, కె. బొడ్డాపుట్టు, జాలరి గుమ్మ, కందులగుంట గ్రామాలలో రేషన్ బియ్యం అందక ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా తమ నాలుగు గ్రామాలకు సమయానికి రేషన్ సరకులు పంపిణీ చేయక అవస్థలు ఎదుర్కొంటున్నట్టు వారు ఆరోపిస్తున్నారు. సేల్స్‌మెన్‌ను అడిగితే పొంతన లేని సమాధానాలు ఆరోపించారు. దీనికితోడు తమ గ్రామాలకు రేషన్ బండి రావటం లేదని అంటున్నారు. దీంతో సంపంగిపుట్టు మినీ డిపో వరకు వెళ్లి రేషన్ తీసుకురావాలంటే ఒక్కొక్కరికి రూ. 200 రవాణా చార్జీలు అవుతున్నాయని వాపోయారు. కిండలం వరకు రో డ్డు బాగానే ఉన్నా వాహనం మరమ్మతు అయిదంటూ ఎండీయూ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నట్టు విమర్శించారు. ఫలితంగా 10 కేజీల బియ్యం కోసం రూ.200 ఖర్చు వెచ్చించాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి కిండలం వద్ద డిపో ఏర్పాటు చేసి రేషన్ పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు.


రేషన్ బియ్యం కోసం ఆందోళన చేస్తున్న కే బొడ్డాపుట్టు గ్రామస్థులు

పార్టీ పటిష్ఠానికి సమష్టి కృషి

» అరకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిరంజీవి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి చిరంజీవి

అరకులోయ, ఏప్రిల్ 22 (ఇంధ్రజ్యోతి): అరకు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ పటిష్టతకు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ ఇన్‌చార్జి చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఓ రిసార్టులో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన పార్టీనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత , ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గిరిజన ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. పార్టీపై విశ్వాసం, క్రమశిక్షణతో మెలిగిన వారికి అధిస్థానం గుర్తింపు నిస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గపరిధిలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటుచేయాలన్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన నేతలు 14 మందితో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ గ్రామాల్లో విస్తరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ కార్యదర్శి ముల్లంగి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి బంగురు రాందాస్ ,ఆరు మండలాల జనసేన పార్టీ అధ్యక్షుడు రామకృష్ణ, చిట్టం మురళి, కోటేశ్వరరావు పడాల్, రాంబాబు లతో పాటు పెదలబుడు మాజీ సర్పంచ్ రఘునాథ్,మాజీ వైస్ సర్పంచ్ సత్యానందం, బొండాం పెసా కమిటీ ఉపాధ్యక్షుడు, న్యాయవాది సుంకరి ఆనంద్, పలువు నాయకులు పాల్గొన్నారు.

'జీవో 3 పునరుద్ధరణపై సీఎం హామీ నిలుపుకోవాలి'

కొయ్యూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అరకు వేదికగా జరిగిన గత ఎన్నికల సభలో తాము అధికారంలోకి వస్తే జీవో 3 ను పునరుద్ధరిస్తామని, లేదా ప్రత్యామ్నాయ జీవో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని స్థానిక ఎంపీపీ బడుగు రమేశ్ బాబు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ గిరిజన నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గిరిజనులకు జీవో ఏర్పాటు చేశాక మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. లేకుంటే జిల్లా మొత్తం 512 పోస్టులు ఉండగా.. ఎస్‌టీలకు 6 శాతం గిరిజనేతరులకు 94 శాతం కేటాయిస్తారన్నారు. దీని వల్ల గిరిజన నిరుద్యోగులకు తీరని నష్టం వాటిల్లుతుందని అన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


దారపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ సుభాష్

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ దారాపల్లి ఎంపీపీ పాఠశాలలో పలువురు విద్యార్థులు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షల్లో మంచి ప్రతిభను కనబరిచేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతకు శ్రమించిన ఉపాధ్యాయులు హరీశ్‌చంద్ర, అనంతరావు, రమాప్రభలను సర్పంచ్ ఎస్.సుభాష్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులు ఏకలవ్య స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో మంచి ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేశారని అభినందించారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం


డుంబ్రిగుడలో మానహారం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డుంబ్రిగుడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చిరు ధాన్యాలతో ఆరోగ్యకరంగా ఉండవచ్చని స్థానిక సర్పంచ్ వెంకటరావు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో నీలిమ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహార పక్షోత్సవాల ముగింపులో భాగంగా పౌష్టికాహార ప్రదర్శన, ప్రతిజ్ఞను చేశారు. ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిలో మానవాహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గీత, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో గిరిజనులతోనే టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

పాడేరురూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో స్థానిక ఆదివాసీలతోనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్సతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీతో పాటు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీని ప్రకటిస్తారని ఎదురు చూసిన ఆదివాసీ నిరుద్యోగ యువతను నిరాశపరిచారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏజెన్సీ పర్యటనలో ఎకో టూరిజం అభివృద్ధిపై చేసిన ప్రకటన వెనుక అంతర్యం పర్యాటకం పేరిట కార్పొరేట్ సంస్థలు కేంద్రంతో రూ. 25 వేల కోట్లతో ఒప్పందం జరగడమేనని ఆరోపించారు. ఏజెన్సీ 11 మండలాల్లో చాలా మందికి చెప్పులు లేవన్నారు. పవన్ కళ్యాణ్ ఒక గ్రామంలో ఉంటున్న 300 మందికి పంపించడం సరికాదన్నారు. ఇలాంటివి పంపిణీ కాకుండా గిరిజనుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తేమేలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు పాలికి లక్కు, కిల్లో సురేంద్ర పాల్గొన్నారు.


ఐటీడీఏ పీవో అభిషేక్‌గౌడకు వినతిపత్రమిస్తున్న ప్రతినిధులు

స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి

ఆదివాసీలకు స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు మంగళవారం ఐటీడీఏ పీవో డాక్టర్.ఎంజే అభిషేక్‌గౌడకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, డీఈవో కేంద్ర కమిటీ నాయకుడు ఎస్.మాణిక్యం, గిరిజన ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కె.కాంతారావు, టీడబ్ల్యూటీఏ జిల్లా అధ్యక్షుడు నీలకంఠం, వివిధ సంఘాల నాయకులు వి.నాగేశ్వరరావు, ఎల్.సుందరరావు, భానుచందర్, సలీమ్, జగన్మోహనఖరావు, కృష్ణారావు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు తీవ్ర అన్యాయం

ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీతో ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గిరిజన భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మెగా డీఎస్సీలో షెడ్యూల్ ప్రాంత గిరిజనులకు 6 శాతం పోస్టులు కేటాయించడంతో వేలాది మంది ఆదివాసీ నిరుద్యోగులు నష్టపోతారన్నారు.ఈ సమావేశంలో నాయకులు ఎం.ఈశ్వర రావు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలో ఏసీఎం ద్రావణం పిచికారీ : డీఎంహెచ్‌వో


కాడెలిలో మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమీల్ బాషా

పాడేరురూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో దోమల నివారణకు ఏసీఎం 5 శాతం మందు పిచికారీ చేయాలని డీఎంహెచ్‌వో జమీల్ బాషా సూచించారు. మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని కాడెలి, వర్తనాపల్లి గ్రామాల్లో జరుగుతున్న పిచికారీ పనులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో రెవెన్యూ, సచివాలయ శాఖ, వెలుగు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సమన్వయంతో మలేరియా నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. ముందుగా ఆయా గ్రామాలక సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీ కేంద్రాల పరిధిలోని 311 సచివాలయాల్లో 2,086 ఎంపిక చేసిన గ్రామాల్లో ఉంటున్న 5.16 లక్షల మంది జనాభా ఆరోగ్యం పరిరక్షణకు తొలివిడత పిచికారీ కార్యక్రమాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశ జూలై 1వ తేదీ నుంచి చేపట్టాలన్నారు. గ్రామాల్లో జ్వర లక్షణాలతో బాధపడుతున్న రోగులను సకాలంలో గుర్తించి మలేరియా నిర్ధారణ పరీక్షలు జరపాలని సిబ్బందికి ఆదేశించారు. దోమతెరల వినియోగంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎం.కిరణ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి జి.సింహాద్రి, బి.లక్ష్మయ్య, సబ్‌యూనిట్ అధికారి బి.ధనుంజయ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి సహకారం: డీఎస్పీ

పెదబయలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత అభివృద్ధి పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలకు ప్రజాప్రతినిధులు సహకరించాలని పాడేరు డీ ఎస్పీ షేక్ సహబాద్ అహ్మద్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీలు చేపట్టారు. అనంతరం మండల ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే తమ ధ్యేయమన్నారు. అందుకు ప్రజా ప్రతినిధుల సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లో గంజాయి సాగు, రవాణా, నాటు సారా తయారీ, విక్రయాలు, జూదాలను అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు. మూఢనమ్మకాలను అరికట్టాలని అన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాలపై గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రమణ, వైస్ ఎంపీపీ రాజుబాబు వివిధ పంచాయితీల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఎస్పీ సహబాద్ అహ్మద్

ఆరోగ్యంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

పెదబయలు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డి. హేమలత దేవి అన్నారు. మంగళవారం పెదబయలు యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వాహణ జరుగుతున్న ముంచంగిపుట్టు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగిన మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావి తరాల భవిషత్తు మహిళల చేతుల్లోనే ఉందని, వారు ఆరోగ్యంగా ఉంటే పుట్టబోయే పిల్లల ఆరోగ్యవంతంగా ఉంటారని చెప్పారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. గైనిక్, రొమ్ము క్యాన్సర్, నెలసరి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి, గుమ్మ పుష్పజోసెఫ్, వైద్యులు నిఖిల్, శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ హేమలతదేవి

జీవో 3పై వైసీపీ నేతలకు మాట్లాడే హక్కులేదు: జనసేన

అనంతగిరి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ పాలనలో జీవో 3పై ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ మౌనంగా ఉండి, ప్రస్తుత ప్రభుత్వంలో రద్ధాంతం చేయడం వి డ్డూరంగా ఉందని జనసేన పార్టీ నాయకులు విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళీ మాట్లాడారు. ఐటీడీఏ పాలకవర్గ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యేలు జీవో 3పై కేకలు వేశారని, అసలు గత ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏం చేశారని ప్రశ్నించారు. జీవో 3ను సుప్రీంకోర్టులో రద్దు చేస్తే.. కనీసం రివ్యూ పిటిషన్ దాఖలు చేసి అడ్డుకోలేకపోయారని మండిపడ్డారు.. ప్రజలకు అన్ని తెలుసు గనుకనే కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలోని అరకువేలి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు మండలాల పార్టీ అధ్యక్షులు అల్లంగి రామకృష్ణ, సీదరి దనేశ్వరరావు, కోటేశ్వరరావు పడాల్, కిల్లో బాబు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ వర్సుకుమ్మి గ్రామ సమీపంలో సిమెంట్ బస్తాలతో వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం ఉదయం బోల్తా పడింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. రాములు గ్రామం నుంచి వర్సుకుమ్మి వరకు గల ఘాట్‌లో ఈ ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదం జరిగినట్టు స్థానికులు తెలిపారు.అక్కడే రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ జేసీబీతో బోల్తా పడిన ట్రాక్టర్‌ను తీశారు.


జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

విద్యా పర్యటనలతో విద్యార్థులకు జ్ఞానం

▸▸ జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విద్యా పర్యటనలతో విద్యార్థులకు జ్ఞానం వస్తుందని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు పేర్కొన్నారు. మండలంలోని కొప్పాకలో డీఈవో కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధ్యయన, అవగాహన పర్యటనకు సంబంధించి కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా పర్యటనలు పుస్తకాల్లో చదివిన విషయాలను నిజ జీవితంలో చూడటానికి విద్యార్థులకు సహాయ పడతాయన్నారు. ఇవి విద్యార్థులకు జ్ఞానాన్ని సమకూరుస్తాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గమాంబ జాతర పోస్టర్ ఆవిష్కరణ


దుర్గమాంబ జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు

పరవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెంలో గురువారం నిర్వహించనున్న దుర్గమాంబ జాతరకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వెన్నెల పెద్దింటి అప్పలనాయుడు, వెన్నెల ఏకుల అప్పారావు, పైలా రథాల సన్యాసిరావు, వెన్నెల సన్యాసిరావు, వెన్నెల గిరి, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు, పైలా అప్పలనాయుడు, పైలా ప్రసాద్, గొంప మారునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ముసలితల్లి పండుగ


అమ్మవారిని దర్శించుకుంటున్న సురేంద్ర, నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డు సమీపంలో ముసలితల్లి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన ముసలితల్లి అమ్మవారి పండుగను నిర్వాహకులు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు, కె.రమణఅప్పారావు, కాండ్రేగుల శంకరరావు, కొణతాల శివ, బుద్ద గంగాధర్, నాయకులు ఎస్.భానుచందర్, పైలా గోపి పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యులకు సత్కారం


సత్కారాలు పొందిన ఉత్సవ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ రోడ్డులోని చినబజార్ వద్ద గల సీతారామ ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా జరిపేందుకు కృషి చేసిన 21 మంది కమిటీ సభ్యులను మంగళవారం ఆలయ శాశ్వత కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షుడు కొణతాల జగన్నాథరావునాయుడు, అధ్యక్షుడు కె.నారాయణరావులు సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సిరసపల్లి సూరిబాబు, డి.వెంకటేశ్వరరావు, ఎస్.దుర్గారావు, తిమ్మాపాత్రుని వెంకటేశ్, సిరసపల్లి రాజు, పాముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన


నియామకపు పత్రాలను అందుకున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదినారాయణ మహిళా కళాశాల (ఏడీ స్కూల్)లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాధికారి ఎస్.గోవిందరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు. వివిధ కంపెనీల్లో 1100 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన యువతీ, యువకులు పాల్గొన్నారన్నారు. స్థానికంగా కాని ఇతర ప్రదేశాల్లో ఉద్యోగావకాశాలు పొందిన వారు నియామకపు పత్రం తీసుకున్న ఆ కంపెనీలో జాయిన్ అయి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాకు 455 మంది హాజరయ్యారని, వీరిలో 171 మంది వివిధ కంపెనీలకు ఎంపిక కాగా 50 మంది వరకు ఉద్యోగ మేళా నిర్వహించిన చోటే నియామకపు పత్రాలను అందించారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

డీవీఎన్ కళాశాలలో..

దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలను చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. నేషనల్ కెరీర్ సర్వీసెస్ యంగ్ ప్రివిలేజర్ డి.శ్యామ్, డెక్కన్ ఫార్మాసిటికల్ ప్రతినిధి పి.సుప్రియ, ఎస్‌కేఎల్ సొల్యూషన్ మేనేజర్ పి.సంతోష్, మ్యాజిక్ బస్ ప్రతినిధి గంగాధర్ తదితరులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు చేశారు. ఈ నియామకాల్లో వందకుపైగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందని ప్రిన్సిపాల్ కె.రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, అధ్యాపకులు యు.నాగేశ్వరరావు, జమీర్ పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం.. సమస్యల మయం!

శిథిలావస్థలో కశింకోట తహసీల్దార్ కార్యాలయ భవనాలు

అరకొర సదుపాయాలు.. ఇరుకు గదుల్లోనే విధులు

ఉద్యోగుల కొరతతో సేవలు అందించడంలో తీవ్ర జాప్యం

కశింకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస సదుపాయాలు కొరవడ్డాయి. కార్యాలయ భవనాలు పాడుబడ్డాయి. గదులు ఇరుకుగా ఉన్నాయి. దీనికితోడు సిబ్బంది కొరతతో ప్రజా సేవలు జాప్యమవుతున్నాయి.

మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని 1998లో నిర్మించారు. అప్పటి నుంచి కార్యాలయం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. దీనివల్ల ఎక్కడికక్కడే బీటువారిపోయి పగుళ్లు ఏర్పడ్డాయి. రికార్డులు భద్రపరిచేందుకు సరైన వసతి లేకపోవడంతో ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఉద్యోగులతో పపాటు అక్కడి వచ్చే ప్రజలు కూడా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఉద్యోగుల కొరతతో సేవల్లో జాప్యం

కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎ.శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా సెలవు పెట్టేశారు. దీంతో అనకాపల్లి తహసీల్దార్ విజయకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేగాకుండా డిప్యూటీ


శ్లాబు పెచ్చులు ఊడిపోతుండడంతో ప్రమాదకరంగా ఉన్న భవనం


శిథిలావస్థలో ఉన్న కశింకోట తహసీల్దార్ కార్యాలయ భవనం

తహశీల్దార్ కుమారస్వామి కూడా అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారు. అప్పటి నుంచి ఆ బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. అలాగే సుమారు ఐదు నెలల నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సీనియర్ అసిస్టెంట్ వంటి కీలక పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దీనివల్ల క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని స్థానికులు వాపోతున్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ నివేదికలు తప్పనిసరిగా ఉంటేనే సమస్యలకు పరిష్కారమార్గం చూపగలుగుతారని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇక, మండలంలోని మొత్తం 28 గ్రామాలకు 20 మంది వీఆర్‌వోలు ఉండాల్సి ఉండగా, 14 మంది మాత్రమే పనిచేస్తున్నారు. గ్రేడ్-1లో నలుగురు, గ్రేడ్-2 పది మంది సచివాలయ వీఆర్‌వోలు ఉన్నారు. వీరిలో ఒకరు అనారోగ్యం కారణంగా సెలవులో ఉండగా, మరొకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం మొత్తం 12 మంది మాత్రమే ఉన్నారు.


రెవెన్యూ కార్యాలయంలో కనీస భద్రత లేని రికార్డు గదులు

కనీస వసతుల కల్పనలో విఫలం

విధులు నిర్వహించేందుకు సరైన వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. మంచినీటి వసతి, బాతురూముల్లో వాడుకనీరు లేకపోవడంతో మహిళా ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా వివిధ సేవలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటున్నది. కనీసం కూర్చొనేందుకు బల్లలుగానీ, కుర్చీలుగానీ లేకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సేవలకు అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని, వసతి సౌకర్యాలను కల్పించాలని మండల వాసులు, ఉద్యోగులు కోరుతున్నారు.

13 మంది గురుకుల విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

సబ్బవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం గురుకుల విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారు. వీరితో పాటు కెమెస్ట్రీ ఉపాధ్యాయులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. గురుకుల విద్యాలయంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధి వీవీ.బుచ్చిరాజు పర్యవేక్షణలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, సీఐ పిన్నింటి రమణ తదితరుల సమక్షంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పీరియాడిక్ టేబుల్, ఫిజిక్స్ కాన్స్టెంట్ వ్యాల్యూస్, ఫిజిక్స్ ఫార్ములాస్, కెమిస్ట్రీ ఫార్ములాస్‌ను 13 మంది విద్యార్థులు అతి తక్కువ సమయంలో పఠించారు. పీరియాడికల్ టేబుల్ నందు 118 మూలకాల పేర్లను జె.నిశాల్ 16, డి.విశ్వనాథ్ 18, బి.మనోహర్ 19, ఎల్.తనూష్ 21, ఎం.అశోక్ 21, కె.శివహేమంత్ 21, కె.సుధాకర్ 21, జె.సంపత్‌వినయ్ 22, పి.ప్రవీణ్ 22, భరద్వాజ్ 23, గైడ్ టీచర్ డాక్టర్ టి రాంబాబు 37 సెకండ్లలో పఠించి గిన్నిస్ బుక్ ఆఫ్ వర్ల్డ్ రికార్డును అధిగమించారని ప్రిన్సిపాల్ తెలిపారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సీఐ పిన్నింటి రమణ తదితరులు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు సమయం విలువ తెలుస్తుందన్నారు. వీటిపైన


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో తహసీల్దార్ చిన్నికృష్ణ, ప్రిన్సిపాల్ రామకృష్ణ

పట్టు సాధించడం వల్ల ఐఐటీ, జేఈఈ పరీక్షల్లో ప్రతిభను చాటుకోవచ్చన్నారు. అలాగే విద్యార్థుల్లో పోటీతత్వం, కొత్త విషయాలు తెలుసుకోవాలన్న జిజ్ఞాశ పెరుగుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, తహసీల్దార్, సీఐ చేతులు మీదుగా విద్యార్థులకు, గైడ్ టీచర్ రాంబాబుకు ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు వీవీజే.గోపాలరావు, జిల్లా గురుకులాల సమన్వయాధికారి ప్రభావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

18 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్, సివిల్ పోలీసులు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి తుమ్మపాల కొత్తపేటవీధికి చెందిన చిన్నాల ప్రభావతి మద్యం దుకాణంలో పది మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆమెను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు చెప్పారు. కాగా మునగపాక శివారులో మద్యం అమ్మకాలు సాగిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం దాడి చేసి మళ్ల కాశీవిశ్వనాథ్ నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మణ్‌నాయుడు తెలిపారు.

బంగారమ్మతల్లి అనుపోత్సవం రేపు


బంగారమ్మతల్లి ప్రతిమ

సబ్బవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లేపల్లి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం బంగారమ్మతల్లి అనుపోత్సవం గురువారం జరిపేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉదయం ఉదయం 6 గంటల నుంచి వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు చేస్తారు. అలాగే కోలాటం, చిడతల బజనలు, సాముగరిడీలు, నేల డ్యాన్సులు బాణసంచా కాల్పులతో అమ్మవారి ఊరేగింపు, అనంతరం అనుపోత్సవం జరుగుతుంది. రాత్రికి శ్రీకృష్ణ రాయబారం ఏకపాత్రాభినయం, గయోపాఖ్యానం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదమే..

పీహెచ్‌సీ ప్రధాన మార్గంలో భయపెడుతున్న రంధ్రం

భయాందోళనలో వాహన చోదకులు, ప్రయాణికులు

పరవాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ బీసీ కాలనీ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రహదారికి ఆనుకుని ఉన్న రంధ్రం (మ్యాన్ హోల్) ప్రమాదకరంగా పరిణమించింది. కాలనీ వాసులు, విద్యార్థులు, వాహనదారులు పీహెచ్‌సీ, ప్రధాన రోడ్డుకు వెళ్లేవారు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. తాగునీటి పైప్‌లైన్‌కు చెందిన మ్యాన్‌హోల్ తుప్పల చాటున ఉండటంతో పాటు మూత లేకపోవడంతో దగ్గరకు వెళ్లే వరకు కనిపించడం లేదు. ప్రధానంగా రాత్రుల సమయంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దీని కారణంగా ఎప్పుడు ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. నెలలు తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే నాథుడే లేకపోయారని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని వాహన చోదకులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గతుకుల మయంగా తయారైన ప్రధాన రహదారి... (ఇన్‌సెట్‌లో) రహదారిని ఆనుకొని పొదల మాటున ఉన్న రంధ్రం

పంట నూర్పిడి యంత్రం పనితీరు పరిశీలన


వరి పంట నూర్పిడి యంత్రం వద్ద వ్యవసాయశాఖ అధికారులు

పరవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ గ్రామానికి చెందిన రైతు కోన రామునాయుడుకు ఆహార భద్రత పథకం కింద ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన వరి పంట నూర్పిడి యంత్రాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ డైరెక్టరేట్ కార్యాలయానికి చెందిన ఏడీఏ ఆర్.శశిధర్‌రెడ్డి మంగళవారం సిబ్బందితో కలిసి పరిశీలించారు. పంట నూర్పిడి యంత్రం పనితీరు, రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తుంది, ఎలా పనిచేస్తుందనే విషయాలు స్థానిక రైతుతో కలిసి చర్చించారు. రబీ సీజన్‌లో పంట నూర్పిడి యంత్రం ద్వారా రోజుకు సుమారు పది గంటలకు పైగా వరి నూర్పిడి చేయడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ యంత్రం వల్ల డబ్బు ఆదాతో పాటు పని సులభంగా జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏవోలు బి.సురేష్‌కుమార్, సిహెచ్.చంద్రావతి, ఆర్.గాయత్రి, సర్పంచ్ ఎం.సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో ప్రవేశాలకు అంగీకార పత్రాలు


విద్యార్థిని తల్లిదండ్రులకు అంగీకార పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బడిఈడు విద్యార్థులను చేర్పించే విధంగా వారి తల్లిదండ్రులకు అంగీకార పత్రాలపై సంతకాలు సేకరించారు. కొద్ది రోజులుగా ఉపాధ్యాయులంతా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలను, సదుపాయాలు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం తేగాడ, సత్తమ్మకాలనీ, అనకాపల్లి మండలం తమ్మయ్యపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, నాణ్యమైన విద్య, క్రీడల్లో శిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఆర్‌వీ.అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మారాయుడుపేటలో పోషన్ పఖ్వాడా

పరవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీ పరిధిలోని ధర్మారాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఏడో పౌష్టికాహార పక్షోత్సవాల ప్రాముఖ్యతను సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహనకల్పించారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆయన కోరారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, అంగన్‌వాడీ కార్యకర్తల కె.ఉమా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య పార్కును ఆధునికీకరించాలి

తుమ్మపాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శారదానది ఒడ్డున గల అన్నమయ్యపార్కును ఆధునికీకరించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. పార్కు ఉన్న ప్రాంతం దుర్గంధపూరితంగా మారిందని, అన్నమయ్య విగ్రహం సైతం ఉత్సవ విగ్రహంలా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి అన్నమయ్య విగ్రహాన్ని తుది మెరుగులు దిద్ది పూర్వ వైభవాన్ని తీసుకురావాలని కోరారు.

ఘనంగా బోయమాంబ పండగ

తరలి వచ్చిన భక్తజనం


పూజలు అందుకున్న బోయమాంబ

పరవాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి దిబ్బలగొర్లివానిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దైవం బోయమాంబ అమ్మవారి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు అమ్మవారి ఆలయం వద్ద బారులు తీరారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్థానిక నాయకులు పోలిరెడ్డి దేముడు, పైలా రమణబాబు, పోలిరెడ్డి అప్పారావు, సన్నిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ప్రైవేటు ఆసుపత్రులను ప్రోత్సహించడం తగదు

సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో బాధితులకు సకాలంలో వైద్య సాయం అందించాలనే పేరుతో ప్రైవేటు ఆసుపత్రులను ప్రోత్సహించాలనే ప్రభుత్వం ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనకాపల్లిలో హెల్త్ సిటీ కింద 7.68 ఎకరాలను ప్రైవేటు ఆసుపత్రులకు అప్పజెప్పే వీఎంఆర్‌డీఏ ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో బర్నింగ్ వార్డు, ఇతర మల్టీ స్పెషాలిటీ తరహా వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. పరిశ్రమల ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని అచ్యుతాపురంలో ఏర్పాటు చేస్తున్న ఈఎస్‌ఐ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. అలాగే ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణాలు తొందరగా పూర్తి చేసి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నేడు ప్రజాదర్బార్

పరవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించడంతో పాటు సమస్యలపై చర్చిస్తారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయరూ..

తుమ్మపాల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ ఒక ప్రకటనలో కోరారు. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల బోర్డును పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పలువురు కార్మికులకు అందాల్సిన క్లైయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయని వాపోయారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధులను సైతం పక్కదోవ పట్టించిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు బాసటగా నిలవాలని ఆయన కోరారు.

26న మండల సర్వసభ్య సమావేశం

కశింకోట, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో వి.వి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయులు పొలంబాట



మర్రివలసలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, వారి పిల్లల పేర్లు నమోదు చేసుకుంటున్న కొత్తకోట హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రావికమతం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు తీవ్రంగా కృషిచేస్తున్నారు. గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు వున్న ప్రతి ఇంటికీ వెళ్లి.. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంటే.. రానున్న విద్యా సంవత్సరంలో కూడా ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. ఒకవేళ విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతుంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, పథకాల గురించి వివరిస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు కాకుండా మీ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తామని భరోసా ఇస్తున్నారు. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తామని హామీ ఇస్తున్నారు. కాగా ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులు జరుగుతుండడంతో పలువురి ఇళ్లకు తాళాలు వేసి వుంటున్నాయి. దీంతో ఉపాధ్యాయులు ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువులు, పంట కాలువలు, ఇతర చోట్లకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. మండలంలోని కొత్తకోట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు మంగళవారం కన్నంపేట, వమ్మవరం, మర్రివలస గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న తల్లిదండ్రులను కలిశారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు.. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కన్నయ్యనాయుడు, ఎం.వెంకునాయుడు, ఎర్రాపాత్రుడు, ఆర్.శ్రీనివాసరావు, జె.ప్రసాద్ పాల్గొన్నారు.

ముందే పూసిన మే పుష్పాలు



మాకవరపాలెంలో పూసిన మే పుష్పాలు

మాకవరపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెంలో మే పుష్పాలు ముందే పూశాయి. గ్రామానికి చెందిన రుత్తల సత్యనారాయణ ఇంట్లో ఈ పుష్పాలు వికసించాయి. వాస్తవానికి ఈ పూలు ఏటా మే నెలలో పూస్తాయి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే పూయడంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. పోషన్ పఖ్వాడా-2025పై మంగళవారం ఉదయం రాష్ట్ర స్థాయి సమావేశాన్ని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు అభిమతమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలకు గ్రాట్యుటీ విషయంలో సీఎం సానుకూలంగా వ్యవహరించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకుని క్షేత్రస్థాయి సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో సేవలను అందించాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార పంపిణీని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీవీ, ఫోన్ల వినియోగానికి పెద్దలు తాము దూరంగా ఉంటూ పిల్లలను కూడా దూరంగా ఉంచేలా చూడాలన్నారు. గిరిజన ప్రాంతాలతో పోలిస్తే మైదాన ప్రాంతాల్లో సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయని, ఈ పరిస్థితి మారాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. జనాభా వృద్ధి సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇద్దరు లేదా ముగ్గురు, అంతకంటే ఎక్కువ అనే నినాదాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ జపాన్‌లో మాదిరిగా ఇక్కడి పిల్లలకు కూడా ఆరోగ్యకరమైన అలవాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటుచేసిన ఫుడ్ స్టాళ్లను మంత్రి, అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధి రేషా ఎన్ దేశాయ్, ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి, పీడీ జయదేవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇది కూటమి విజయం

- ప్రభుత్వ అభివృద్ధిని చూసి వైసీపీ కౌన్సిలర్లు మనసు మార్చుకున్నారు
- అందుకే అవిశ్వాస తీర్మానం వీగిపోయింది
- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



మునిసిపల్ కార్యాయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కూటమి హయాంలో మాత్రమే అభివృద్ధి జరుగుతున్నదన్న ఉద్దేశంతో బీజేపీలో చేరిన మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారిని పదవి నుంచి దించేయడానికి వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలు విఫలం అయ్యాయని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం వీగిపోయిన అనంతరం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎలమంచిలి అభివృద్ధికి చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. ఆయన ప్రోత్సాహంతోనే వైసీపీ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ రమాకుమారిపై అవిశ్వాస నోటీసు ఇచ్చారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి పలువురు వైసీపీ కౌన్సిలర్లు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారని అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కన్నబాబురాజు, యానాద్రి కాలువ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోయారని ఆయన ప్రశ్నించారు. మరో రెండు రోజుల్లో యానాద్రి కాలువ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం కూటమి విజయంగా ఆయన అభివర్ణించారు. ఆయన వెంట కూటమి నాయకులు శ్రీరామదాసు, కొఠారు శ్రీను, అన్నం బాబ్జీ, పప్పు ఈశ్వరరావు, గుర్రాల శేఖర్, చిట్టిబాబు తదితరులు వున్నారు.

మా కౌన్సిలర్లను ప్రలోభపెట్టారు

- తగిన బలం లేనందునే 'అవిశ్వాస' సమావేశాన్ని బహిష్కరించాం
- మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు



మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో వైసీపీకి చెందిన అందరు కౌన్సిలర్ల ఆమోదంతోనే అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చామని, కానీ అధికార పార్టీ వారు, కొంతమంది కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి వారివైపు లాక్కున్నారని మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) ఆరోపించారు. మంగళవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, పలువురు కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబురాజు మాట్లాడుతూ, అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి అవసరమైనంత మంది సభ్యులు (కౌన్సిలర్లు) లేకపోవడంతో సమావేశానికి వెళ్లకుండా బహిష్కరించినట్టు చెప్పారు. వైసీపీ సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల్లో అభివృద్ధి పనులే అజెండాగా కౌన్సిల్ సమావేశాల్లో తమ వాణిని వినిపిస్తారని అన్నారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, పడాల శ్రీను, గొర్లె వెంకట్, పిట్టా సత్తిబాబు, దాసరి కుమార్, దుంగా అచ్యుతరావు, దూది నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'మైహోమ్' కాలనీలో వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుపుతున్న వేద పండితులు



తిలకిస్తున్న చినజీయర్ స్వామి, జూపల్లి రామేశ్వరరావు దంపతులు

ఎలమంచిలి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంటు పరిశ్రమకు చెందిన శ్రీనగర్ కాలనీలో శ్రీవేంటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాల్లో చివరి రోజైన మంగళవారం చినజీయర్ స్వామి, మైహోమ్ గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వరరావు, కుమారి దంపతులు హాజరైన స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైహోమ్ గ్రూపు వైస్ చైర్మన్ వినోద్‌బాబు, ఎండీ జూపల్లి రంజిత్‌రావు, డైరెక్టరన్ (ఆపరేషన్స్) పాండే, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజరు బి.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

రెగ్యులర్ ఈఈలు కొనసాగుతున్నారు. వీరిద్దరూ ఈ ఏడాది జూలై/ఆగస్టు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఇక పాడేరు, అనకాపల్లి, భీమిలి డివిజన్‌లలో ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు 15 మంది ఉండాలి. కానీ గాజువాక, పాడేరులో ఒక్కొక్కరు, అనకాపల్లి జిల్లాలో ఇద్దరు మాత్రమే మిగిలారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ఇంజనీర్‌లు 49 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం మూడు జిల్లాల్లో తొమ్మిది మాత్రమే మిగిలారు. వర్క్ ఇన్‌స్పెక్టర్లు 60 మంది వరకూ రెగ్యులర్ విధానంలో పనిచేసేవారు ఉండాలి. ఇప్పుడు కేవలం నలుగురు నుంచి ఐదుగురు మాత్రమే మిగిలారు. అదేవిధంగా జిల్లా కార్యాలయాల్లో మేనేజర్లు, అకౌంట్స్ అధికారులు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పోస్టులలో చాలావరకూ ఖాళీగా ఉన్నాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఇంకా కార్యాలయాల్లో మరికొన్ని కేడర్లు, క్షేత్రస్థాయిలో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా అవుట్ సోర్సింగ్ విధానంలో పలువురు పనిచేస్తున్నారు.

ప్రస్తుతం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్క విశాఖ జిల్లాలోనే 1.3 లక్షల ఇళ్లు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మరో 30 వేల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి రెండు వేల ఇళ్లకు ఒక ఏఈ, పది వేల ఇళ్లకు డీఈ హోదా ఉండే అధికారి ఉండాలి. కానీ విశాఖ నగర శివారు ప్రాంతాల్లో 65 లేఅవుట్‌లలో 1.3 లక్షల ఇళ్లు మంజూరుకాగా తొలి విడతలో రమారమి లక్ష ఇళ్లు పనులు కొనసాగుతున్నాయి. నాలుగు గ్రామీణ మండలాలు, నగరంలో సొంత స్థలాల్లో మరో పది వేల ఇళ్ల వరకూ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల పురోగతిని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ...జాప్యంపై అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. క్షేత్రస్థాయిలో లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాల పురోగతి, నాణ్యతా పరిశీలించేందుకు అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల కొరత కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని చెప్పాలి. దీనికితోడు ఉన్న కొద్దిమంది కూడా ప్రతిరోజు టెలికాన్ఫరెన్స్‌లు/వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకావాలి. వారాంతపు ప్రగతి నివేదికలు తయారుచేసి అధికారులకు పంపాలి. ఈ ఏడాది చివరికల్లా మరికొంతమంది రెగ్యులర్ అధికారులు, సిబ్బంది పదవీ విరమణ చేయనున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు రాబోయే రోజుల్లో భారీగా ఇళ్లు మంజూరుచేసే అవకాశం ఉంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే...రానున్న రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పర్యవేక్షణ ఎలా అనేది ప్రభుత్వం ఆలోచన చేయాలని వారంతా కోరుతున్నారు.

వైసీపీకి పరాభవం

... 5వ పేజీ తరువాయి

వైసీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ గత నెల 26వ తేదీన 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోకు, స్థానిక మునిసిపల్ కమిషనర్‌కు నోటీసులు అందజేశారు. కౌన్సిలర్ల సంతకాలు ధ్రువీకరించుకున్న తరువాత అవిశ్వాస తీర్మానంపై ఏప్రిల్ 22 వ తేదీన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మొత్తం సభ్యుల్లో 2/3 వంతు మంది (17) మద్దతు తెలిపాలి. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా చేసేందుకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్ తెరవెనుక ఉండి వ్యూహాత్మకంగా పావులు కదిపారు. అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన కౌన్సిలర్లలో ఆరుగురిని తమవైపునకు తిప్పుకుని ఊటీకి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ పెద్దలు, వారిని వెనక్కు రప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించి విఫలం అయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గదని నిర్ధారించుకుని, సమావేశానికి గైర్హాజరయ్యారు.

రిజిస్ట్రేషన్‌ల ఆదాయం డీలా!

.. 5వ పేజీ తరువాయి

మొత్తం 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వుండగా.. 2023-24లో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.278.86 కోట్ల ఆదాయం వచ్చింది. 2024-25లో ఆదాయం రూ.270.74 కోట్లకు తగ్గింది. రిజిస్ట్రేషన్‌ల ఆదాయం తగ్గడంపై జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. రిజిస్ట్రేషన్‌ల విధానం మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం అనేక మార్పు చేర్పులు చేసిందని, ఈ కారణంగా ఆదాయం స్వల్పంగా తగ్గిందన్నారు. అయితే ఈ ఏడాది ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

గంజాయి నిందితులపై కఠిన చర్యలు

- ఆస్తులు జప్తు చేయడంతోపాటు సత్వరమే అరెస్టు
- డీఐజీ గోపీనాథ్ జట్టీ
- రేంజ్ పరిధిలోని ఎస్పీలతో సమీక్షా సమావేశం



సమావేశంలో డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తుల ఆస్తులను గుర్తించి వెంటనే జప్తు చేయడంతో పాటు వారిని అరెస్టు చేయాలని డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో రేంజ్ పరిధిలోని ఎస్పీలతో క్రైమ్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి రవాణా నియంత్రణకు చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే నమోదైన కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, వారిపై ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, తక్షణమే చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోక్సో కేసులో బాధితులకు కలెక్టర్ ద్వారా పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో నిందితులపై ప్రత్యేక హిస్టరీ షీట్లు తెరవాలని, వారి భద్రత కోసం శక్తి యాప్, శక్తి బృందాల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. నేరాల నిరోధానికి ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం ఎలా అన్న దానిపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్పీలు తుహిన్ సిన్హా, అమిత్‌బర్దార్, వకుల్ జిందాల్, మహేశ్వర్‌రెడ్డి, మాధవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య

మునగపాక, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ కాలనీలో రెండు నెలల క్రితం వివాహమైన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ పి.ప్రసాదరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక ఎన్టీఆర్ కాలనీకి చెందిన శివకోటి దుర్గా శంకర్ ప్రసాద్‌కు, ఇదే కాలనీకి చెందిన మేనకోడలు శరణ్యతో ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో వివాహం జరిగింది. ఇదిలావుండగా మంగళవారం ఉదయం ఆమె తల్లి అప్పికొండ నాగమణి వచ్చి, తొమ్మిది గంటల వరకు కుమార్తె వద్దనే వుండి వెళ్లింది. తిరిగి 11 గంటల సమయంలో మరోసారి కుమార్తె ఇంటికి వచ్చింది. ఇంటి తలుపు లోపల గడియపెట్టి వుండడం, ఎన్నిసార్లు పిలిచినా పలకకపోవడంతో ఇరుగురుపొరుగు వారి సాయంతో బలవంతంగా తలుపులు తీయించింది. లోపలికి వెళ్లి చూడగా శరణ్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. తన కుమార్తె కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నదని, ఇది భరించలేక ఆత్మహత్యచేసుకుందని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

అప్పుల సమస్యతో యువకుడి ఆత్మహత్య

రాంబిల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మండలంలోని రాజుకోడూరు గ్రామానికి చెందిన రావి బాబూజీ (32) సోమవారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని ఆటో డ్రైవరు మృతి చెందాడు. ఎంవీపీ కాలనీ ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం చోడపల్లి గ్రామానికి చెందిన దమ్ము శ్రీను (49) ఆటో డ్రైవర్. సోమవారం తెల్లవారుజాము 2.45 గంటల సమయంలో మధురవాడ నుంచి ఆటో నడుపుకుని వెళ్తుండగా.. వెంకోజీపాలెం సిగ్నల్ పాయింట్ సమీపంలో ఎలాంటి సిగ్నల్స్ లేకుండా రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు దమ్ము సూరి శేఖర్ ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శారదా నదిలో మునిగి వృద్ధుడి మృతి

చోడవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ సమీపంలో శారదా నదిలో మునిగి అంబేరుపురం గ్రామానికి చెందిన నందికోళ్ల దేముడు(63) మృతిచెందాడు. ఇతను మంగళవారం మధ్యాహ్నం పశువులను మేపేందుకు నది చెంతకు వెళ్లాడు. నదిని దాటేక్రమంలో పెద్ద గొయ్యిలోపడి మునిగిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక శాఖ సిబ్బంది వెళ్లి దేముడు మృతదేహాన్ని బయటకు తీశారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన తరువాత పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు.

మద్యం సేవించి వేధిస్తున్న భర్తపై వేడి నూనెతో దాడి



తీవ్రంగా గాయపడిన గండికోట బాలకృష్ణ

లంకెలపాలెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వేధిస్తున్న భర్తపై మరిగిన వేడి నునె పోయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ మండలం సాలాపువానిపాలెంలో మంగళవారం తెల్లవారుజామున ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. గుంటూరు ప్రాంతానికి గండికోట బాలకృష్ణ రైల్వేలో లోకో పైలట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామానికి నక్కా రవణమ్మను ప్రేమించి ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు వీరికి ఒక బాబు ఉన్నాడు. 20 రోజుల క్రితం సాలాపునివానిపాలెంలో ఇంటిని అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. బాలకృష్ణ తరచూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతున్నాడు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య మరోసారి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఇంటి యాజమాని, ఇరుగుపొరుగు వారు సర్దు బాటు చేశారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఇరువురు మరోసారి గొడవ పడ్డారు. దీంతో రమణమ్మ నూనెను బాగా మరిగించి బాలకృష్ణ ముఖంపై పోసి, తలుపులు వేసి పరారైంది. దీంతో అతను బిగ్గరగా కేకలు వేయడంతో ఇంటి యజమాని తాతారావు, స్థానికులు వచ్చి తలుపులు తీసి బాలకృష్ణను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యానికి తరలించారు. 40 శాతానికిపైగా శరీరం కాలిపోవడంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. తనపై గతంలో ఒకసారి యాసిడ్‌తో దాడి చేసినట్టు బాలకృష్ణ పోలీసులకు తెలిపాడు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న కమ్మల పాక

అచ్యుతాపురం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తి పంచాయతీ శివారు నడింపల్లిలో మంగళవారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో కమ్మల పాక, పశువుల పాక, ధాన్యం పురి కాలిపోయాయి. పక్కనే వున్న ఒక పక్కా ఇంటిలో సామాన్లు దగ్ధమయ్యాయి. నడింపల్లి సమీపంలోని జీపీ అగ్రహారంలో నూకాలమ్మ పండగ జరుగుతుండడంతో అత్య. దికులు అక్క డకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో వడిసెల సూరిబాబు ఇంటి నుంచి మంటలు రావడంతో స్థానికులు చూసి ఆర్పడానికి ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. ఈ సమయంలో గాలి అధికం గా వీచడంతో పక్కనే ఉన్న పశువులపాక, ధాన్యం పురికి వ్యాపించాయి. పక్కనే ఉన్న వడిసెల సన్నిబాబు శ్లాబ్ ఇంటిలోకి కూడా మంటలు వ్యాపించాయి. షార్ట్ సర్క్యూట్ కావడంతో ఫ్రిజ్, టీవీ, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఏపీఐఐసీ నుంచి అగ్నిమాపక శకటం వచ్చినప్పటికీ ఫలితం లేకపో యింది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు.

కర్రివానిపాలెంలో యువకుడి అదృశ్యం



సిద్దిళ్ల వెంకటసాయి (ఫైల్ ఫొటో)

ఎస్.రాయవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్రివానిపాలెం గ్రామానికి చెందిన సిద్దిళ్ల వెంకట సాయి అనే యువకుడు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. వెంకటసాయి ఈ నెల 18న అదే గ్రామంలో జరిగిన అమ్మవారి జాతరకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి వెంకటలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

గీతం వర్సిటీలో గిరిజన విలువిద్య పోటీలు

విశాఖపట్నం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బిర్సాముండా 150వ జయంతిని పురస్కరించుకొని జన్‌జాతీయ ఖేల్ మహోత్సవ్, ట్రైబల్ ఆర్చరీ మీట్‌ను నిర్వహించనున్నట్టు టీసీఆర్ అండ్ టీఎమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మందా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఏప్రిల్ 25, 26వ తేదీల్లో గీతం యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరు కానున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	425
విజయనగరం	429
శ్రీకాకుళం	429